# ఖరీదైన కల

'సుమన్'

ఇహ నిలబడ దలచుకోలేదు.

విసుగు కల్గసాగింది. కాని నిలబడక తప్పదు. ఎందుకంటే సోమసుందరం గారు యింకా రాలేదు.

గడియారం వంక చూశాను.

దుమ్ము కొట్టుకుపోయి గీరలుపడి పగిలిన అద్దంలోనుంచి వంకరలు తిరిగిన పెద్దముల్లు, చిన్నముల్లు నాలుగ యింద వ్రేళ్లు చూపిస్తున్నాయి.

అంటే ఐద యిందన్నమాట.

కాలానికి నా గడియారం ఓగంట వెనుక బడే వుంటుంది.

నా గడియారంలో యింకో విశేషం వుంది. అపుడపుడు చిన్నముల్లు రెండు మూడు రోజులవరకు వీలుగా వుంటే యింకా ఎక్కువగాను ఒకేచోట ఆగిపోతుంది. పెద్దముల్లు మాత్రం గానుగ ఎద్దులా తాను ఒక్కటే అనర్తులాకార ప్రపంచానికి చక్రవర్తి అన్నట్లుగా తిరుగుతూ వుంటుంది.

ఒక్కొక్కసారి పెద్దముల్లు విశ్రాంతి తీసుకొంటూ వుంటే చిన్నముల్లు తిరుగుతూ వుంటుంది.

రోడ్డుమీదకు చూశాను. సోమసుందరం గారి కారుకూడా ఎక్కడా కనిపించుటలేదు.

రోజూ యిదే వేళలో ఆ పెద్ద హోటలుకు ఆయన కాఫీకి వస్తారు. యిక్కడ తప్ప ఆయన్ని యింకా ఎక్కడా కలుసుకోలేరని చాలామంది చెప్పారు.

చాలసార్లు ఆయన ఇంటికి వెళ్లాను. గూర్ఖా అదిలింపులు, అల్సేషియన్ అరుపులు తప్ప నాకు ఆయనతో యింటర్వ్యూ దొరకలేదు.

పోనీ యిప్పుడైనా కారులోనుంచి దిగి హోటలులో పాలరాయిమీద కుడికాలు పెట్టేలోపల ఆయన వెంట నడుస్తూ నా నిరుద్యోగాన్ని గురించి, నా దరిద్రాన్ని గురించి చెప్పుకోవాలి. ఆయన నావంక చూడకుండానే, ఏసీ

వినకుండానే హోటల్‌లోకి బంగారపు సూటిలోకి వెళ్ళే గోరువంకలా వుంటాడు. ఆ హోటల్‌లోకి వెళ్ళా లంటే నా నిరుద్యోగం క్వాలిఫికేషన్ పనికిరాదు. ఎట్‌లీస్ట్ ఓ ఎంబాసిడర్, వెర్లిను సూట్స్ వుండాలి.

విసుగుగా అతి నేర్పుగా ఈ బక్క శరీరంలోకి తొక్కి ఏమీ తోచక ఆకాశంవంక చూశాను. నల్లటి మేఘాలు ఒకదాని కొకటి ఆకలితో కౌగలించు కొంటున్నాయి. మేఘాల లోని నలుపు నాకు కొందరి మనుషుల లోను, కొన్ని గుండెలలోను కనబడు తుంది.

కౌగలించుకున్న మేఘాలు అరవ టం ప్రారంభించాయి. సంతోషంగా వస్తున్న గాలి కెరటం రోడ్డుమీద దుమ్మును ఎత్తి నామీద, నా చుట్టూవున్న వాళ్ళమీద పోసింది. ఆ దుమ్మును దులు పుకొనే లోపలే వర్షం కురవటం ప్రారంభించింది.

అంతవరకు మనుషులు నన్ను తోసుకొంటూ బిలా బిలా హోటల్‌కి ఆనుకుని వ్రేలాడుతున్న రేకులషెడ్డు క్రిందకు చేరారు. నేను నడిచి దాని క్రిందకు వెళ్ళలేదు. వాళ్ళే నన్ను తోసు కొని అక్కడ నిలబెట్టారు.

నా చుట్టూ చాలమంది వున్నారు. అడుక్కు తినేవాళ్ళు, బీదవాళ్ళు, ముసలివాళ్ళు, రిక్షాలు లాగేవాళ్ళు, టాక్సీడ్రైవర్లు.

నైలెక్స్ చీరలో ఒళ్ళు దాచుకున్న భారతదేశపు దరిద్ర దేవత అవయవాల వాళ్ళు.

వర్షం వేగంగా కురుస్తోంది. రోడ్డు మీద చినుకులు ఎగిరి మామీద పడు న్నాయి. ఎవరికివాళ్ళే వాటినుంచి తప్పు కోవాలని చూస్తున్నారు.

మళ్ళా రోడ్డుమీదకు చూశాను. నీలి రంగు ప్లిమత్ నీళ్ళను చిమ్ముకుంటూ వస్తోంది. అది ఖచ్చితంగా సోమసుంద రంగారిదే. వాళ్ళందరినీ తోసుకొని ముందుకు వచ్చి నిలబడ్డాను. వాళ్ళను అలా తోసినందుకు కోపంగా నావంక చూశారు.

అలాగే చూస్తారు వెధవలు. ఇప్పుడు ఆ కారులో దిగే మనిషితో మాట్లాడితే అసూయతో ఏడుస్తారు కూడా.

కారు వచ్చి ఆగింది. డోరు తెరుచుకుంది. నేను హోటలు మెట్ల మీదకు వెళ్ళి నిలబడ్డాను.

డోరు తెరుచుకొని ఓ అందమైన యువతి బయటకు వచ్చింది. తలమీద వానచినుకులు పడకుండా 'మేగజైన్' అడ్డుగా పెట్టుకుంది.

కాని సోమసుంధరంగారు ఏడి? నాలో ఉత్సాహం ఆవిరి అయిపోయింది. యిక రాడేమో....

మరొకసారి ఆమెను చూశాను. అంత చలిలోనూ నరాలు జివ్వు మన్నాయి. చక్కటి షిఫాన్ ఫాషన్‌గా ధరించింది. అదేరంగు స్లీవ్‌లెస్‌బ్లౌజు





వేసుకుంది. వెనుక నాలుగు బటన్స్ తళుక్కున మెరుస్తున్నాయి. లోపల అరంగుళం వెడల్పు వున్న బ్రా అగుపించుతోంది. ముఖం గుండ్రంగా వుంది. కళ్ళు చేపకళ్ళలా మిలమిల మెరుస్తున్నాయి. ఎర్రటి పెదవులు....

మంచుతో తడిసిన ఎర్ర గులాబీలా వుంది.

ఈమె ఏ సినిమాస్టారో అయి వుంటుంది. లేదా ఈ మద్రాసులో సగమైనా వెడల్పు గల్గిన యినప్పెట్టె వున్నవాడి ఏకైక పుత్రికా రత్నం అయి వుంటుంది.

ఆమె నడుస్తూవుంటే ఎగుడు దిగుడు లేని నున్నని నడుము పచ్చి వెదురు చువ్వలా ఊగుతోంది.

నాలో అవాక వేడి ...అదో థ్రిల్ ....ఆమె నా ముందే ఇంకొంచెం సేపు వుంటే ఎంత బాగుండును? ఆమె చీరని, ఆమె బ్లౌజుని, ఆమె కళ్ళని, ఆమె పెదవుల్ని, ఆమె బుగ్గల్ని ఎక్స్‌రే కళ్ళతో చూడవచ్చు.

నా చూపులు అకస్మాత్తుగా తివాచీ మీద పడ్డాయి. పసుపు పచ్చటి మనీ బేగ్ మెరుస్తోంది ఎర్రటి తివాచీమీద.

ఆమె చకచక నడచి వెళ్తోంది.

దూకినంత వేగంగా వెళ్ళి బేగ్‌ని తీశాను.

"మేడమ్"

ఆమె వెనక్కి తిరిగింది. తడిసిన కనురెప్పలను ఏమిటన్నట్లుగా ఆడించింది. అవి గులాబిరేకులలా కదిలాయి.

"మీ బేగ్" చేతి కందించాను.

"థాంక్స్" అంది అందుకుంటూ.

ఆమె కళ్ళల్లోకి చూడసాగాను. నా గుండెలలో ఏదో లావా పొంగుతోంది. ఆమె వెళ్ళిపోకుండా చాలాసేపు నాముందే నిలబడితే ఎంత బాగుండును.

"కాఫీ త్రాగుదాం రండి"

మొదట నా చెవులను నేను నమ్మలేను. ఆమె మరోసారి అనేసరికి ఆమెను వెంబడించాను.

బిస్కెట్లను చూసి వెంటబడే కుక్కపిల్లలా వెంటబడ్డాను. ఇంతకుముందు యింత ఖరీదైన హోటలులో అడుగు పెడతానని అనుకోలేదు. ఆ అర్హత నాకు లేదనుకున్నాను. కాని ...

ఇద్దరం స్పెషల్ హాలులో కూర్చున్నాం. అది ఎయిర్‌కండిషన్డ్. చాల వెచ్చగా వుంది. ఆడదాని ఒళ్ళు కంటె, నా ఆలోచన కంటె కూడ వెచ్చగా వుంది.

సోఫాసెట్, మధ్యలో రౌండ్ టీపాయ్. టీపాయ్ మీద ఫ్లవర్ వేజు. అందులో ప్లాస్టిక్ పూల గుత్తులు వున్నాయి.

ఆమె నా ఎదురుగా సోఫాలో శరీరాన్ని నిర్లక్ష్యంగా వదిలి "మీది మద్రాసేనా?" అంది.

నేను తడుముకోక తప్పలేదు. ఇంత వెచ్చని గదిలో యింత అందమైన ఆడదాని ముందు నలిగిపోయి చెమట వాసన వచ్చే జీవిత పుటలను విప్ప దలచుకోలేదు. ఆ పుటలలో వున్న కుళ్ళును చూసి ఆమె ఏవగించుకొని

కాఫీ అవకాశంకూడా యివ్వకుండా బోయ్‌ని పిలచి బయటకు గెంటించ వచ్చు.

"కాదు. విజయవాడ నుంచి వచ్చాను." అన్నాను.

"ఎందుకు?" సూటిగా అడిగింది ప్రశ్న.

అద్దంవంటి ఆమె చెక్కిళ్ళకేసి చూస్తూ అన్నాను. "మా నాన్న కాలసినంత డబ్బు వదలి చెప్పకుండా చచ్చిపోయాడు. దానిని ఖర్చు పెట్టటానికి నానా యిబ్బందులు పడుతున్నాను. ఇక్కడ ఫిల్మ్‌వరల్డుని ఓసారి చూసి పోదామని వచ్చాను."

ఆమె కళ్ళల్లో కొంచెం ఆశ్చర్యం చోటు చేసుకొంది. "ఏదైనా సినిమా తీస్తారా?" అంది కళ్ళు పెద్దవి చేసి.

"అబ్బే అటువంటి కళాసేవ చేయాలనే దురుద్దేశం లేదు. వూరికే కాలక్షేపం కోసం వచ్చాను."

"అయితే రెసిడెన్స్ ఎక్కడ?"

"కన్నెమరాలో"

ఈసారి ఆమె మాట్లాడటానికి నాలుగు నిమిషాలు పట్టింది. ఈ నాలుగు నిమిషాలలో ఆమె నన్ను బంగారు తేపుతో కొలుస్తోంది. నా ఆదాయం ఎట్‌లీస్ట్ రోజుకి ఓ వెయ్యి రూపాయలన్నా వుండి వుండాలని తూస్తూవుంది.

బోయ్ వచ్చి ఎదురుగా నిలబడ్డాడు. ఆమె ఏవేవో చెప్పింది. అవి ముందు పెట్టి వాడు వెళ్ళి ఓ ప్రక్కన నిలబడ్డాడు.

ఆమె టిఫిన్ చాల వయ్యారంగా తింటోంది. తను అందంగా నైస్‌గా తినగలనని చూపటానికి ఎక్కువ ప్రయత్నం చేస్తుంది.

ఆమెలోకి చూస్తూ అన్నాను. "మీ పేరు?"

"నీలవేణి"

"ఏం చేస్తుంటారు?"

"జీవితాన్ని హాబీగా గడిపేస్తూ వుంటాను. డాడీకి కావలసినంత డబ్బు వుంది. నేను ఒక్కదాన్నే కూతుర్ని. మేము ఎప్పుడో యిక్కడకు వచ్చి స్థిరపడిపోయాము."

"ఐసీ" అన్నాను ఆమె వంక క్రీగంట చూస్తూ. ఆమె నా చూపులో చూపు కలిపి ర్వాత తల దించుకుంది.

చాలసేపటివరకు మా యిద్దరిమధ్యా మాటలు లేవు. కొంచెం సేపు గడచిన తర్వాత కాఫీ సిప్ చేస్తూ వుంది. "పోనీ, యిక్కడున్నన్నాళ్ళు మా గెస్టుహౌస్‌లో వుండకూడదూ?"

నన్ను కొలటం పూర్తయి వుంటుంది. సరైన ఆన్సర్ సంపాదించటానికి ప్రాపు గిస్తోంది. ఆగళ్ళ వెంట నేను వెళ్ళలి. ...కాని.

"థాంక్స్ .కాని అంత యిబ్బంది పడలేను. హోటలు అంటే అత్తవారింట్లో సమానం."

ఆమె గలగల నవ్వింది. ఆనవ్వులో కూడా క్రొత్తదనం తీసుకురావటానికి నీలవేణి ఎంతో ప్రయత్నించింది.

ఆమె కాఫీ సిప్ చేస్తూ మాట

మాటకి నావంక చూస్తోంది. క్రింది పెదవిని మాట మాటకి చప్పరించు తోంది. బహుశా క్రింద పెదవి మరింత ఎరుపుగా కనపడాలని ప్రయత్నం కాబోలు.

"ఈ వర్షం అంటే నాకు చాల చిరాకు. ఒక్కొక్కసారి ఏడుపుకూడ వస్తోంది" అంది నీలవేణి.

"నాకూ అంతే. వర్షం కురుస్తూ వుంటే ఏమీ సంతోషం వుండదు. మనిద్దరిది దగ్గర మెంటాలిటీ."

"అఫ్‌కోర్స్" కొంచెంసేపు ఆగి మళ్ళా అంది. "మొన్న అక్టోబరులో వాషింగ్టను వెళ్ళినపుడు యింతే. స్నోఫాల్ అయింది. యింత దూరం ఎందుకు వచ్చామా అని విసుగుగల్గింది. విసుగంటే డాడీ వూరుకోడు....సరేగాని మీరు ఫారెను వెళ్ళారా?"

రెండు చేతుల వ్రేళ్ళను ఒకచోట చేర్చి గడ్డంక్రింద పెట్టి కాళ్ళాడించు తోంది నావంక చూస్తూ. నేను ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాను." పాస్ పోర్టు కోసం అప్లయి చేశాను. ఓ నెల రోజులలో ఫారిన్ వెళ్ళాలను కుంటున్నాను. మీ డాడీ ఏం చేస్తాడు?"

"ఆయన ఓ పెద్ద కేపిటలిస్టు. బ్లాక్ అండ్ వైట్ మార్కెటులో వ్యాపారం" అంది నీలవేణి నవ్వుతూ.

"మా నాన్న అంతే. ఆయన చచ్చి పోయిన తర్వాత ఆస్తి, బిజినెస్ ఒక రూపానికి తీసుకువచ్చేసరికి బంగాళా ఖాతం ఈదినట్లయింది."

నీలవేణి చిరునవ్వు నవ్వుకుంది. ఈసారి నవ్వులో ఎక్కువ కాంతి లేదు.

నేను ఆలోచించ సాగాను.

కొంచెం సేపు నేనూ, నీలవేణి కూర్చున్న గదికి నా జీవితంలో ఓ చారిత్రాత్మక విలువ వుంటుంది. ఈ పాలరాయిలాంటి గోడలు-ఫోమూ సోఫాల క్రింద పరచిన కార్పెట్, ఎయిర్ కండిషనర్ వీటిని నేను జన్మలో మరువలేను. ఇవన్నీ నా జీవితానికి పెంటు పులిమాయి. కొంచెంసేపు నన్ను యిరుకుగావున్న ఆకాశంలో విహరించేట్లుగా చేశాయి.

"మీ రెప్పుడైనా తాజ్ మహల్ చూశారా?" అడిగింది నీలవేణి. ఆమె ఎందుకడిగిందో నాకు తెలుసు. తను యింకా దగ్గర కావటానికి నాకున్న అర్హత లేవో తెలుసుకొంటోంది.


"పున్నమి వెన్నెలలో చూశాను. కాని, విచారపడ్డాను."

"ఎందుకని?" కుతూహలంగా అడిదింది నీలవేణి.

"తాజ్‌మహల్ కట్టినవాళ్ళు ఎక్కడా కనపడలేదు,"

"వాళ్ళెప్పుడో చచ్చి పోయారని డాడీ చెప్తూ వుంటాడు. అయితే మీరు శ్రీ శ్రీ పుస్తకాలు చదివారన్నమాట."

"నేనసలు తెలుగు పుస్తకాలు చదువను. తెలుగు సినిమాలు చూడనని ఒట్టు వేసుకున్నాను. వర్డ్స్‌వర్త్, కీట్సు, జాన్‌డాన్, మామ్, గార్డినర్, మొలా,




వియా, గోక్కులంటే నాకు చాల యిష్టం."

"పుస్తకాలు చదవటం మీ హాబీ అన్నమాట."

"బొమ్మలు గీయటం కూడ.'

మీరు బొమ్మలు గీస్తారా ?

"ఆ....మిమ్మల్ని చూసిన తర్వాత అనిపించింది."

ఆమె సిగ్గుపడి అందంగా నవ్వి "యూ సిల్లీ"....అంది

నీలవేణి యిపుడు నావంక నిండుగా చూసి తరువాత ఏమీ తెలియనట్లుగా సోఫాలవంక గోడలవంక చూడ సాగింది.

నీలవేణి కళ్ళల్లో ఒకరకమైన అసంతృప్తి, భయం కనబడుతున్నాయి నాకు.

నేను లేచాను. నా వెనుకే నీలవేణి వచ్చింది. తనే బలవంతంగా కౌంటర్‌లో బిల్లు చెల్లించింది.

బయట వర్షం యింకా తగ్గలేదు. జోరుగా కురుస్తోంది,

"ఈ వర్షంలో మీరు ఎలా వెళ్తారు. కారులో లిఫ్ట్ యిస్తానురండి."

"థాంక్స్. కాని చాల పనులున్నాయి. రేపు కలుసుకుందాము."

"ఎక్కడ ?" చటుక్కున అడిగింది.

వర్షం తగ్గిపోతే మోనాలో"

"నో. రేపు మార్నింగ్ కన్నెమరాకు వస్తాను."

నేను అలూపాను. కారు స్టార్టు చేసుకొని వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ చాల దూరంవరకు చేయి వూపుతూనే వుంది.

తరువాత అటు ఇటు చూశాను. కొన్ని జతల కళ్ళు నావంక అసూయగా చూస్తున్నాయి. వాళ్ళవంక యిపుడు చూడదలచుకోలేదు.

కాని, సోమసుందరంగారు....ఛత్ ఆయన ఆలోచన కూడ యిపుడు అక్కరలేదు.

మెదడు చాల వేడిగా వుంది. శరీరం పువ్వులమీద పడుకొని లేచినంత హాయిగా వుంది. మనసు గువ్వలా ఆకాశంలో తేలిపోతోంది.

ఇక అక్కడ వుండాలనిపించలేదు. ఆ వర్షంలో తడుస్తూ నా అద్దె గదికి చేరాను.

* * *

టాక్సీ బాణంలా దూసుకుని వెళ్ళి గేటులో ఆగింది. మీటరు చూసి అద్దె యిచ్చి నడవసాగాను.

గూర్ఖా వంగి వంగి నమస్కారాలు పెట్టాడు. వాడిని చూసి చూడనట్టుగానే ముందుకు వెళ్ళసాగాను. ఆల్సేషియన్ పెంపుడిదిలా నా వెంట బడుతూ, ఎగురుతూ, నా చేతిని నాకుతూ వస్తోంది. దానిని విదిలించి కొట్టాను. అది ఏడుస్తున్నట్లుగా కూస్తూ పారిపోయింది.

ఇంద్రభవనంలాంటి భవనం వైపు చూస్తూ ఆలోచిస్తున్నాను.

కారిడార్‌లో ఎదురయ్యారు సోమసుందరంగారు.

"హల్లో, హార్టిలీ వెల్‌కమ్ - నీలూ చెప్పింది నీ గురించి. రా కూర్చో."

ఆయన ఎదురుగా సోఫాలో కూర్చున్నాను. పనిమనిషికి కాఫీలు తెమ్మని చెప్పి సోమసుందరంగారు నా ఎదురుగా కూర్చున్నారు.

నా కళ్ళు నీలవేణి కోసం వెతకసాగాయి. నాతో రావటానికి ఏ చీర కట్టుకుంటే బాగుంటుందో ఆలోచించుతూ వుంటుంది. ఆమెగాక కోసం మెట్లవంక చూడసాగాను.

"నీలూ స్నానం చేస్తుంది. ఇపుడే వస్తుంది. ఆ-ఏమిటి కబుర్లు? కన్నెమరాలో బాగా వుంటోందా?"

"ఏమున్నాయి. మీరే చెప్పండి. చాల హాయిగా వుంటోంది."

"అమ్మాయి అన్ని విషయాలు నిన్ను గురించి చెప్పింది. అవన్నీ విన్న తర్వాత నిన్ను చూడకుండానే నాకు కొన్ని అభిప్రాయాలు ఏర్పడిపోయాయి. చూసిన తర్వాత అవి స్థిరపడిపోయాయి. కాని నీ విషయంలో ఒకటి నచ్చలేదోయ్."

"ఏమిటండీ?"

"మేము యిక్కడ వుండగా, నువ్వు హోటల్‌లో వుండటం. ఇక్కడ నీకు ఏ లోటూ రానియ్యము. సాయంత్రం వచ్చేయవోయ్."

"ఎందుకులెండి."

"అదే నాకు నచ్చదు. ఆ అన్నట్లు పొరుగుచోటునుంచి వచ్చావు. ఏమైనా డబ్బు కావాలి సే అడుగు. సిగ్గుపడకు."

"అలాగే."

నీలవేణి వచ్చింది. వస్తూనే కాఫీలు పట్టుకువచ్చి టీపాయ్ మీద పెట్టింది. సోమసుందరంగారు అన్నాడు. "నాకు చాల పని లున్నాయి. కంపెనీకి ఫోన్ చేయాలి. మీరు మాట్లాడు కొంటూ వుండండి."

ఆ యన వెళ్ళిపోయాడు.

నీలవేణి ఎదురుగా కూర్చుని కాఫీలో పంచదార కలుపుతోంది. తెల్లగా పొడవుగా వ్రేళ్లు ఒణుకుతున్నాయి.

కాఫీ సిప్ చేస్తూ ఆమె కళ్ళల్లోకి చూశాను. సిగ్గు రంగు వేసుకున్న మొగ్గలా వున్నాయి. నిన్నటి గంభీరత చంచలత్వం యిపుడు ఆ కళ్ళల్లోలేవు. స్నిగ్ధత్వం కొట్టవచ్చినట్లు కనబడు తోంది.

"మాట్లాడవేం ?" అడిగాను.

"ఏం మాట్లాడను ?" సన్నగా అంది చిరునవ్వు నవ్వుతూ.

"ఇక్కడ మాట్లాడలేవు. ఎటైనా పోదాం పద."

"పదీ" అంది నీలవేణి.

కొన్ని క్షణాలలో నీలవేణి నడుపు తున్న కారులో నేను ఫ్రంట్ సీటులో వున్నాను. కారు రోడ్డుమీద వేగంగా వెళ్తోంది

సఫైరెలో ఇంగ్లీషు పిక్చరు చూసి బయటకు వచ్చాము. మౌంటురోడ్డు మీద కారులు చీమల మాదిరిగా పోతు న్నాయి. రెండున్నర గంటలు ఎయిర్ కూలర్‌లో వుండటంవలన చలి చలిగా వుంది బయటకు వచ్చిన తర్వాతకూడ. నా ఎడమ చేతిని తన కుడిచేతిలోకి తీసుకొని నొక్కుతూ "ఎక్కడికి పోదాం ?" అంది నీలవేణి.

"ఎటైనా దూరంగా పోయి ఒంట రిగా కూర్చుందాం."

కారు స్టార్టు చేసింది నీలవేణి. నేను ఆమె ప్రక్కనే కూర్చున్నాను. రోడ్డు మీద మా కారు చీమలలో కలసి పోయింది. ఎత్తైన మేడలు కదలి పోతున్నాయి. యల్.ఐ.సి., స్పెన్సర్ అన్నీ దాటిపోతున్నాయి.

నాకు ఎంతో హాయిగా వుంది. ఎపుడూ యిలా వుంటే చాలు. నీలవేణి దయ నామీద వున్నంత కాలం నాకేమీ అక్కర్లేదు.

నా వంక చూసుకున్నాను. నా వేషా నికి నాకే ఆశ్చర్యం వేసింది. ఖరీదైన సూటూ, జేబునిండా డబ్బు, గాగుల్సు, బూటు....

మధ్య మధ్య నీలవేణి నా వంక, నా వేషం వంక దాహంతో చూస్తోంది. నాలుక తడుపుకొంటూ వుంది. అమె కారుని డ్రైవ్ చేస్తూనే కావాలని నామీద పడుతోంది.

ఇపుడు ఆమెకు నాకు ఎటువంటి దూరం లేదు.

కొన్ని నిమిషాలలో ప్రెసిడెన్సీ

మలుపు తిరిగి కారు మెరినాలో ఆగింది. లాక్‌చేసి చాల దూరం యిసుకలో నడుచుకొంటూ వెళ్ళాము. నీలవేణి చేయి పుచ్చుకొని యిసుకలో బూటు వేసుకొని నడవటంలో అదొక ఆనందం.

మనుషులకు చాల దూరంగా కూర్చున్నాము.

వెన్నెల ఒళ్లు తెల్లబడింది. తెల్లబడిన ఒళ్ళ క్రింద అలలు నలిగి మెరుస్తున్నాయి. చిక్కటి నీలిసముద్రంమీద పలుచటి తెలుపు వెన్నెల వింత సమ్మేళనం.

కొంచెం సేపు యిద్దరం ఏమీ మాట్లాడలేదు. సముద్రంవంక చూస్తూ కూర్చున్నాము.

"ఏమైనా కబుర్లు చెప్పు" అడిగింది నీలవేణి.

"నువ్వే చెప్పు" అన్నాను.

"పిక్చర్ చాల బాగుంది."

ఎందుకందో నాకు తెలుసు. సినిమాలో హీరో హీరోయిన్‌లు ఒళ్లు మరచిపోయి కౌగలించుకునే టపుడు నీలవేణి మత్తుగా నావంక చూసింది. నా మీద చేతులు వేసి నిమిరింది. తన ముఖాన్ని నా భుజానికేసి రుద్దింది.

యిప్పుడు ఆ విషయం గుర్తు చేస్తోంది.

"సినిమాకన్న థియేటర్‌లో నువ్వే బాగున్నావు."

"నువ్వు సినిమా చూడలేదా?"

"చూడలేదు. నీవంకే చూస్తూ కూర్చున్నాను."

నీలవేణి సిగ్గుపడింది. ముఖాన్ని చేతులలో కప్పుకొని (వేళ్ళ సందుల్లోంచి నవ్వుతూ చూస్తోంది.

ఆ నవ్వులన్నీ చూశాను. అక్కడ కొన్ని వేల వసంతాల దృశ్యాలు కనబడుతున్నాయి. కొన్ని కోయిలలు అందంగా కూస్తున్నాయి. ఎన్నో అందమైన విరబూసిన పూలు సుగంధాలతో ఆడుకొంటున్నాయి. నేను చాల తేలికపడి అక్కడ విహరించసాగాను.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" నీలవేణి ప్రశ్నతో యీ లోకంలోకి వచ్చాను.


"నిన్ను గురించే. నువ్వు చాలా అందంగా వున్నావు."

"నీ కంటేనా? నా అదృష్టంవలన నీ పరిచయం కల్గింది." నా భుజాలకు అంటుకుపోయింది. వీపుమీద వేళ్ళతో గోముగా రాస్తోంది.

"నా అదృష్టం కాదా?" నేను గొణుక్కున్నాను.

ఇపుడు డబ్బు, అందంవున్న నీలవేణి నాది. నేను ఏమిచేయమంటే అది చేస్తుంది. సోమసుందరంగారు మా పెళ్ళికి ఒప్పుకోకపోతే కారు, కారునిండా డబ్బు తీసుకుని ఎక్కడికైనా ఎగిరి పోదామంటే 'వూ' అంటుంది.

"నీకు ఈ సంఘం అంటే భయమా?" అడిగాను.




"ఏం, ఎందుకు?"

"ఊరికే అడుగుతున్నాను."

"నాకు భయంలేదు. నేను ఎవరిని అశ్యపెట్టను. మరి నీకో?"

"నాకూ అంతే - ఈ సంఘాన్ని అశ్యపెట్టకుండా పగ తీర్చుకుంటూ వుంటాను.

కొంచెంసేపు మౌనం.

"కొన్ని రోజులు ఎక్కడైనా పోదాం పద." అన్నాను కళ్ళల్లోకిచూస్తూ.

"ఏమిటీ, పారిపోవటమా వద్దు.... డాడీతోచెప్పి పెళ్ళి చేసుకుందాము."

"డాడీతో చెప్పి పిల్లల్ని కూడ కందాము." వ్యంగ్యంగా అన్నాను. కాని ఆ మాటకు ఆమె ఖరీదుగా సిగ్గు పడింది. తరువాత పకపకనవ్వి నన్ను చుట్టుకుపోయింది.

మోకాళ్ళమీద యిసుకలో నిలబడి నీలవేణిని హృదయానికి హత్తుకున్నాను.

కొంచెంసేపు అక్కడ ఏమీలేవు. అంతా వేడి - ఉద్రేకం - చల్లటి పిలి చీకటి....

కొంచెంసేపు అలాగే వుండి పోయాము.

"డాడీతో నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పాను. నిన్ను చేసుకోటానికి ఒప్పుకుంటాడు. కాబట్టి బెంగపడకు" అంది బుగ్గమీద చిటికవేసి.

బుగ్గలు నిమురుకున్నాను.

పెరిగిన గడ్డం గుచ్చుకుంది.

ఉలిక్కిపడి లేచాను. బయటకుండ పోతగా వర్షం కురుస్తోంది. కిటికీలోంచి చలిగాలి రివ్వున కొడుతోంది.

ఇప్పటివరకు నేను ....

కల. పంచరంగుల కల .... ఏడ్వాలనిపించింది.

నేను లేను, మెరీనా లేదు. నీలవేణి లేదు. నీలవేణి మెరీనాలో తనలాంటి నిరుద్యోగితో వుంటుందా ?.

ఎయిర్ కండిషన్డ్ గదిలో పిల్లో మీద బోర్లాపడుకుని తియ్యటి కలలు కంటూ వెచ్చటి వూపిరి తీసుకుంటూ వుంటుంది.

కాని నేను ??

మరునాడు ఉదయం సెంట్రల్ స్టేషనులో బయలుదేరిన బండిలో థర్డ్ క్లాసు కంపార్టుమెంటులో టి. సి.వచ్చి టికట్ అడుగుతాడేమోనని బెదురు చూపులు చూస్తూ కిటికీలోనుంచి వస్తున్న చలికి తట్టుకోలేక ముడుచుకొని కూర్చుని అనుకున్నాను.

ఇపుడు నీలవేణి నా కోసం కన్నెమరాకు వెళ్ళటానికి అలంకరించుకొంటూ వుంటుంది. తెల్లటి చీర కట్టుకుంటుంది. అదేరంగు బ్లౌజువేస్తుంది. ముఖాన పౌడరు పులిమి నల్లటి కాటుక ఎర్రటి కళ్ళకు పులుముతుంది.

ఉలిపిరి కాగితంలో చుట్టబడిన గులాబిలా వుంటుంది అలంకరించుకొని.

"ఛత్ .... అలా జరగకూడదు" అనుకున్నాను.

కదలిపోతున్న చెట్లవంక రాత్రి వర్షానికి నీళ్ళలో మునిగిన పొలాల వంక చూస్తూ కూర్చున్నాను. ఎటు వెళ్తున్నానో ఆలోచించకుండా.

***


## నిరీక్షణ వృధాకాదు! కారాదు!!

"శైక్రటరీ", "విజేత", "గోమతి" లాంటి సీరియల్ కథలను పాఠకుల ముందుంచిన "జ్యోతి" తన పాఠకులు అభిమానించగల, అభిమానులు ఆదరించగల, మరో సీరియల్ త్వరలో మీ కందిస్తోంది.

ఇప్పటికింతే

"జ్యోతి"